క్లుప్తంగా

విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి

ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మానాయక్



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటయ్య, శోభారాణి, రాంచందర్, గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, మౌనిక, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

జూడో లీగ్ ఛాంపియన్‌షిప్ కైవసం



నగదు బహుమతితో దీపిక

మొయినాబాద్ రూరల్: సౌత్ జోన్ ఖేల్‌లో ఆల్ ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ ఛాంపియన్‌షిప్‌ను చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపిక ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చేస్తూ క్రీడల్లో ప్రతిభ చూపుతుందన్నారు. ఈ నెల 28న లక్నోలో నిర్వహించిన పోటీల్లో ఛాంపియన్‌షిప్‌తో పాటు రూ.5వేలు బహుమతి సాధించిందని పేర్కొన్నారు. అనంతరం దీపికను పశ్చిమ ప్రాంతీయ గురుకులాల సమన్వయ అధికారి డాక్టర్ శారదావెంకటేశ్, క్రీడా ప్రత్యేకాధికారి రామ్‌లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

కాలుష్య కారక పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కేశంపేట: దత్తాయపల్లి గ్రామ శివారులోని ఎంఎస్ మినరల్స్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని తూర్పుగడ్డ తండా గ్రామ ప్రంచాయతీ ప్రజలు శుక్రవారం ఆర్డీఓ మాధవరావుకి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల గడ్డి, గాలి కలుషితం కావడంతో ఆవులు, పశువులు మృతి చెందుతున్నాయని వారు ఫిర్యాదులో పెర్కొన్నారు. పరిశ్రమ యాజమాన్యానికి ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఈ కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆర్డీఓకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. శంకర్, శ్రీను, రవి,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

షాబాద్: మండల పరిధిలోని లక్ష్మరావుగూడ గ్రామం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శుక్రవారం గొలుసుల వెంకటేశం, రాంచరణ్ కన్నెస్వామి స్వగృహంలో నిర్వహించారు. ఈ పూజను ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి చేశారు. స్వామివారికి పుష్పాభిషేకం, భస్మాభిషేకం, నెయ్యాభిశేకం, చందనాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నాగేందర్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన మల్ల చెన్నయ్య ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే డబ్బులు సరిపోకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ట్రస్టు సభ్యులచే.. చెన్నయ్య ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే స్టీల్, సిమెంట్ తదితర మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నర్సింహ, వినయ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గట్టుఇప్పలపల్లిలో గ్యాస్ కేవైసీ

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో గ్యాస్ ఏజెన్సీవారు శనివారం గ్యాస్ ఖాతా నంబర్‌కు కేవైసీతో పాటు ఆధార్ లింక్ చేపడుతున్నట్లు కాంగ్రెస్ నేత రేణురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. గ్రామస్తులు తమ గ్యాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

నేటి నుంచి షాబాద్ ఉర్సు

- పహిల్వాన్ షావలి దర్గా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- కులమతాలకు అతీతంగా ప్రార్థనలు
- దోషాలు తొలగుతాయని నమ్మకం
- హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు



ముస్తాబైన పహిల్వాన్ షావలి దర్గా



దర్గా ముఖద్వారం

షాబాద్: రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ ప్రాంత వాసుల ఆరాధ్య దైవం పహిల్వాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానుంది. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు వారం రోజులు కొనసాగనుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా 30న గంధం కార్యక్రమం ఉంటుంది. దీని కోసం అదేరాత్రి 10 గంటలకు మల్కీబావి సమీపంలోని దర్గా నుంచి ఊరేగింపు నిర్వహిస్తారు. 31న ఆదివారం చిరాగాన్, కవ్వాలీ, 1న మీనాబజార్ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. 2, 3వ తేదీన పహిల్వాన్ చెరువు కట్టపై దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. 4వ తేదీన హైదరాబాద్‌చెందిన ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పార్థనలో పాల్గొనడమే కాకుండా పాటలు పాడుతారు. 5వ తేదీన గుల్బార్గాకు చెందిన బృందం ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. 6, 7, 8వ తేదీల్లో మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు కుల మతాలకు అతీతంగా ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

దర్గా చరిత్ర..

షాబాద్ ప్రాంతంలో పహిల్వాన్ షావలి సజీవ సమాధి కావడంతో ఈ దర్గాకు పహిల్వాన్ షావలిగా పేరు వచ్చింది. ఈ దర్గాకు సుమారు 420 ఏండ్ల చరిత ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో షాబాద్ దట్టమైన అడవిగా ఉండేది. నిజాం వంశానికి చెందిన మాలిక్ షా కుష్టువ్యాధిగ్రస్తుడై మనస్థాపంతో అడవుల పాలయ్యాడు. అడవిలో తిరుగుతూ షాబాద్ ప్రాంతంలోని ప్రస్తుత చెరువు గట్టుపైన పహిల్వాన్ షావలి దర్గా సమీపంలోని రావివృక్షం కింద సేద తీరేక్రమంలో అతని స్వప్నంలోకి దివ్య స్వరూపుడు ఒకరు వచ్చి సమీపంలోని మల్కీబావిలో నీళ్లు తాగి చెరువు పక్కనే ఉన్న ప్రస్తుత పహిల్వాన్ షావలి దర్గా వద్ద రావి చెట్టు కింద ప్రార్థన చేస్తే దోషాలు తొలగుతాయనేది ఆ కల సారాంశం. దీంతో మాలిక్‌షా అదే విధంగా చేసి వ్యాధి నుంచి విముక్తి పొంది నిజాం వారసత్వంలో ఉన్నత స్థానాన్ని పొందారు. వెంటనే మాలిక్‌షా షాబాద్‌లో దర్గా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతంలోని అన్ని మతాల ప్రజలు సమైక్యంగా ప్రార్థనలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు.

అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు..

వారం పాటు సాగే ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా నిర్వాహక కమిటీ సభ్యులు తౌఫీక్, మజీద్, సత్తార్, ఇస్మల్, సలీం, తాజ్, ముజీబ్, సత్తార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఈ దర్గాకు రంగులు వేసి అందమైన విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఈ ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. షాద్‌నగర్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్ తదితర డిపోలకు చెందిన బస్సులు అరగంటకో బస్సు వస్తుంది. చేవెళ్ల, షాద్‌నగర్‌ల నుంచి షాబాద్‌కు ప్రత్యేకంగా బస్సులు నడిపించనున్నారు.

హాజరుకానున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు...

షాబాద్‌లో జరిగే ఉర్సు ఉత్సవాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొడంగల్ మజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి రవీందర్, ఎంపీటీసీ అశోక్ హాజరవుతున్నట్లు ముస్లిం సోదరులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ యాదయ్యగౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

దరఖాస్తు స్వీకరణ కేంద్రాల పరిశీలన



దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలకు అర్హులను ఎంపిక చేసే నిమిత్తం ఏర్పాటు చేసిన ధరఖాస్తు స్వీకరణ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీనగర్ కాలనీ, గంజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రాల వచ్చే వారందరికి దరఖాస్తు పత్రాలను అందజేయాలని సూచించారు. అర్హులైన వారికి ప్రభుత్వం గుర్తించి సంక్షేమ ఫలాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి, బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, కోన దేవయ్య, మలగారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దవడ ఎముకలు విరిగిన వారికి ఆపరేషన్లు

- పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో వైద్యసేవలు
- నిపుణులైన వైద్యులతో నిర్వహణ
- సూపరింటెండెంట్ రామక్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్లు రామక్రిష్ణారెడ్డి, వసంతధార, రాజ

చేవెళ్ల: ప్రమాదాల్లో దవడ ఎముకలు విరిగిన వారికి చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసే వైద్యసౌకర్యం అందుబాటులో తీసుకొచ్చారని సూపరింటెండెంట్ రామక్రిష్ణారెడ్డి అన్నారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం ఆయన మాక్సిలో పేషియల్ సర్జన్ డాక్టర్ వసంతధార, అనస్తీయా డాక్టర్ రాజలతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎనిమిది మందికి విజయవంతంగా ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ప్రమాదాల్లో గాయాలైన వారికి తమ ఆసుప్రతిలో వైద్యసేవలు అందించేందుకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. అవసరమైన వారికి ప్రత్యేక వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఆపరేషన్లు చేస్తామన్నారు.

రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి

సర్పంచ్ గోవిందు అశోక్



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అశోక్

నందిగామ: రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నర్సప్పగూడ సర్పంచ్ గోవిందు అశోక్ అన్నారు. నర్సప్పగూడలో శుక్రవారం ఆయన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాట్న శేఖర్, ఎంపీటీసీ ఎంకిరాల కలమ్మ, వార్డు సభ్యులు సత్యం, కృష్ణ యాదవ్, కుమార్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న రవీందర్ నాయక్



చేవెళ్ల: కేసులు పరిష్కరిస్తున్న అధికారులు

ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ నాయక్

షాద్‌నగర్: జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరమే కేసులు పరిష్కరిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లిలో ఇప్పటి వరకు 2,238 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 400 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. మైనర్ల డ్రైవింగ్ లైసెన్సు విషయంలో 69 నమోదు కాగా అందులో 50 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ సంబంధిత కేసులు పరిష్కరించుకోవాలని కోరారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి నేడు చివరి రోజు

చేవెళ్ల: లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ పోలీస్ కేసులు పరిష్కరించుకునేందుకు శనివారం చివరి రోజని రిటైర్డు జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలో నమోదైన కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఇందులో 108 మందికి సంబంధించిన కేసులను పరిష్కరించారన్నారు. ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, పీసీ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడితే ఫలితం దక్కుతుంది

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్: కష్టపడి పరిశోధన చేసిన వారికి తప్పనిసరిగా ఫలితాలు వస్తాయని చెతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి కళాశాలలో పని చేస్తున్న రామోజు షామిలికి డాక్టరేట్ ప్రకటించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామోజు షామిలి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో 'సింథోసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ ఫైర్ ఆన్ డెరివేటివ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్ కవిత పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రకటించిన డాక్టరేట్‌ను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య, రవీందర్, రీసర్చ్ డీన్ ఆర్ కిస్టఫర్, కంట్రోలర్ జగదీష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ పాఠశాలలో వార్షికోత్సవం

షాద్‌నగర్: పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ అంజలి రజ్దాన్, ఎంఈఓ శంకర్‌రాథోడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్‌కె. రాజేంద్రప్రసాద్, డాక్టర్ వంశీ, రవిప్రకాశ్ హర్మాశ్, ప్రిన్సిపాల్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్‌రూరల్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని పాతజాతీయ రహదారి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన సత్తిరెడ్డి(53)ని భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో ఒంటరిగా ఉంటున్న సత్తిరెడ్డి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ విశ్రాంతి భవనంలో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఈ నెల 26న చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. పాతజాతీయ రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో చుట్టు ప్రక్కల వారిని విచారించారు. దీంతో కొందరు మృతుడు ప్రభుత్వ విశ్రాంతి భవనంలో ఉండేవాడని చెప్పారు. పోలీసులు చనిపోయిన వ్యక్తి సత్తిరెడ్డిగా నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సింహ్మానాయక్ తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

తుర్కయంజాల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ట్రాన్స్‌కో సీజీఎం ఆనంద్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించి వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పలుచోట్ల దెబ్బతిన్న, వంగిపోయిన, తుప్పుపట్టిన కరెంటు పోల్‌లతోపాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, పనిచేయని ఏబీ స్విచ్‌లను గుర్తించారు. బిల్లులో పేరు మార్పిడి, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ కరుణాకర్, డీఈ యాదగిరి, ఏడీఈ వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.7లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యంతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకువస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ అనిత విజయ్, ఎంపీటీసీ నిట్టె మంగమ్మ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌యాదవ్, మండల అధ్యక్షుడు జగన్, సీఐ వెంకటేశ్వర్లు, ఏఈ కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ బాధ్యతలు అర్చక సంఘానికి అప్పగింత

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని బాలాత్రిపురసుందరి దేవాలయ నిర్వాహణ బాధ్యతను రాష్ట్ర వీరశైవజంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘానికి అప్పగించారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయ స్థల దాతలు దుగ్గ పార్వతి అర్చక సంఘానికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య మాట్లాడుతూ... ఇక మీదట లోక కల్యాణానికై వీరశైవ జంగమ అర్చక సంఘం చేసే కార్యకలాపాలు ఈ దేవాలయం నుంచే జరిపిస్తామని తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మఠం రాజశేఖరస్వామి, ప్రధాన కార్యదర్శి నందీశ్వరస్వామి, కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్, మహేష్, శైలపతి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొందుర్గు: గుర్రంపల్లి గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ యాదమ్మ అమ్మవారికి పట్టు చీర, ఒడిబియ్యంతో మొక్కు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉప సర్పంచ్ బుచ్చయ్య, మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, దస్తగిరి, మల్లయ్య, పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లితో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా ఉచిత హామీలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా ప్రతి హామీని అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ అంబటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 3,723 దరఖాస్తులు

చేవెళ్ల: రెండో రోజు నిర్వహించిన ప్రజాపాలనలో మండలంలోని అన్ని గ్రామాల్లో 3,723 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. మొదటిరోజు 2,003 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

షాబాద్‌లో..

షాబాద్ అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. సీతారాంపురం గ్రామంలో లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ చిన్నఅప్పల నాయుడు తదితరులు పాల్గొరు.

కేశంపేటలో..

కేశంపేట: మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం నుంచే గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులను అధికారులకు సమర్పిస్తున్నారు.

మొయినాబాద్‌లో..

మేడిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలనలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏఓ రాగమ్మ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకోసం ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీ అంజయ్య పాల్గొన్నారు. మొయినాబాద్‌లో 3,739 దరఖాస్తులు వచ్చాయి. రెండో రోజు చిలుకూరులో 481, అజీజ్‌నగర్‌లో 456, ఎత్‌బార్‌పల్లిలో 15, అప్పారెడ్డిగూడలో 17 వచ్చాయి.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: మోకిల గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యం, గ్రామ కార్యదర్శి లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: మోకిలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకయ్య గౌడ్



మొయినాబాద్: మాట్లాడుతున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్



చేవెళ్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ